## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు.
- ప్రకాశం జిల్లాలో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.
- డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

===================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. తొలుత ఆయన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పార్లమెంట్ సభ్యులతో కలిసి.. కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో సోలార్ ప్రాజెక్టులు, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలు తదితర అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. అనంతరం.. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తోనూ సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి.. పోలవరం - బనకచెర్ల ప్రాజెక్టుపై చర్చించారు. రాష్ట్రంలోని కరువు పీడిత ప్రాంతాలకు గోదావరి జలాలను తీసుకెళ్లేందుకు ఈ ప్రాజెక్ట్ కీలకమని తెలియజేశారు.

===================

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్లమోటు వద్ద ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. అత్యంత వేగంగా వస్తున్న కారు, లారీ ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న 8 మందిలో 6 గురు అక్కడికక్కడే మరణించగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను బాపట్ల జిల్లా స్టువర్టుపురం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాగా.. రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి.. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

===================

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ, టెట్ పరీక్షలు ఇప్పటికే విడుదలైన షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. టెట్, డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ వాయిదా వేయాలని కోరుతూ ఆరుగురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అభ్యర్థులు లేవనెత్తిన అంశాల్లో సరైన కారణాలు లేవని జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం అభిప్రాయపడింది. సమస్యలు ఏవైనా ఉంటే హైకోర్టులోనే చూసుకోవాలని సూచించింది. టెట్, డీఎస్సీ షెడ్యూల్ యథావిధిగా కొనసాగుతుందని ఆదేశాలు జారీ చేసింది.

==================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

==================

ఈ నెల 25వ తేదీన జరగనున్న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు ఉదయం ఆయన సంయుక్త కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి సహా పలువురు అధికారులతో కలిసి పరీక్ష నిర్వహణా ఏర్పాట్లు, ఇతర అంశాలపై సమీక్షించి, మార్గదర్శకాలు జారీ చేశారు. పరీక్షకు 8 వేల 424 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, తగిన విధంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే.. తాగునీరు, టాయిలెట్ల వంటి కనీస వసతులు కల్పించాలన్నారు. విశాఖ పరిధిలోని 19 పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్ జామర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

==================

రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన భూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ సూచించారు. భూ సమస్యలపై ఫిర్యాదులు పునరావృత మవుతున్నాయని, వీటి శాశ్వత పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ITDA లో ఈరోజు నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎం జె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డి ఆర్ ఓ కె. పద్మలత లతో కలిసి ఆయన అర్జీదారుల నుండి 89 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖలలో అపరిష్కృతంగా ఉన్న ఫిర్యాదులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే .. రెవెన్యూ అధికారులు మ్యుటేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.

==================

విరామం

==================

పశ్చిమ గోదావరి జిల్లాతో పాటు రాష్ట్రానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాజ్యసభ నూతన సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ చెప్పారు. భీమవరంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఒకే ప్రాంతం నుంచి ఇద్దరు పార్లమెంటు సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సహకరించిన తెలుగుదేశం, జనసేన నాయకులకు, బిజెపి కోర్ కమిటీ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఇతర ఎంపీల సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానని సత్యనారాయణ తెలియజేస్తూ..

(పాకా వెంకట సత్యనారాయణ. వాయిస్ బైట్…19 సెకన్లు)- ప.గో. జిల్లా

కాగా.. ఈ నెల 28వ తేదీన సత్యనారాయణ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

==================

ఆపరేషన్ సిందూర్ విజయాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, భారత సైనికుల పరాక్రమానికి భారతదేశం వందనం చేస్తోంది. సాయుధ దళాలకు సంఘీభావంగా, ఆకాశవాణి వార్తా విభాగం ఒక ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. 1971వ సంవత్సరంలో భారత్ - పాకిస్తాన్ యుద్ధంలో శ్రీనగర్ వైమానిక స్థావరాన్ని కాపాడుతూ ప్రాణత్యాగం చేసిన పరమ వీర చక్ర అవార్డు గ్రహీత, ఫ్లయింగ్ ఆఫీసర్ నిర్మల్ జిత్ సింగ్ సెఖోన్‌ను ఈరోజు మనం స్మరించుకుందాం.

(వాయిస్ బైట్…35 సెకన్లు)

==================

మేజర్ మళ్ల రాంగోపాల్ నాయుడుకు కీర్తి చక్ర అవార్డు దక్కడం అభినందనీయమని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ .. రాంగోపాల్ నాయుడు దేశ రక్షణ బాధ్యతల్లో అత్యంత కీలకంగా ఉంటూ, ఉగ్రవాదుల దాడులు సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. ఆయనకు అరుదైన ఈ గౌరవం దక్కడం సంతోషకరమని పేర్కొంటూ ప్రశంసించారు. శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాళి మండలం నగిరిపెంట గ్రామంలో జన్మించిన రామ్ గోపాల్ నాయుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు.

===================

రానున్న రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నెల 27వ తేదీ నాటికి పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. వీటి ఫలితంగా రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలియజేసింది. ఉరుములతో కూడిన మెరుపులు, గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

===================

===================